
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు



మంగళవారం 8 ఏప్రిల్ 2025



కల్యాణవేదికను పరిశీలిస్తున్న మంత్రులు ఆనం, సవిత, మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్, తదితరులు



దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



వేణుగానాలంకారంలో...

సీతారాముల కల్యాణానికి



భారీగా ఏర్పాట్లు

- పనులను పరిశీలించిన మంత్రులు ఆనం, సవిత, రాంప్రసాద్‌రెడ్డి
- ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంసవాహనాలపై రాముడి విహారం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం టీటీడీ పరిపాలన సమావేశ భవనంలో కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈవో వీర బ్రహ్మం ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 11న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 121 గ్యాలరీల్లోకి సుమారు 80 వేల మంది భక్తులు వస్తారని, వారికి సంతృప్తికరంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తామని తెలిపారు. సుమారు 47,770 అన్న ప్రసాద ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నామని, సుమారు 150 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ కల్యాణోత్సవానికి భక్తులతో పాటు అత్యంత ప్రముఖులు రావచ్చని సమాచారంతో అందుకు తగినట్లు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని రకాల వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు, పోలీసులు సమిష్టిగా కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు కోదండరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్‌లు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. అనంతరం కల్యాణవేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. కల్యాణ వేదికకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, చిన్నయ్య, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నాగరాజు, డీపీవో రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ రమణయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కోలాటాలు



హంసవాహనంపై కోదండరాముడు

హంసవాహనంపై దశరథరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దశరథరాముడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. సోమవారం ఉదయం శ్రీరామచంద్రుడు వేణుగానాలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్త జన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీరాముడిని ఊరేగిస్తూ కోలాహలంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ఆలయంలో తిరుమంజన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలు పెరుగు తేనె, చందనంతో స్వామివార్లకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం

రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, సవితలకు సోమవారం స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రులు బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలనకు ఒంటిమిట్టకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య వారిని గజమాలతో సన్మానించారు. మంత్రులతో పాటు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్సీలు బీదా రవిచంద్రయాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పామూరు సుబ్రమణ్యం, ఓబినేని సుబ్బమ్మ, మావిళ్ల ఈశ్వరయ్య, మావిళ్ల రామకృష్ణయ్య, మోదుగుల నరసింహులు, రేవిళ్ల బాలమునెయ్య, బోగా శంకరయ్య, కట్టా విశ్వనాథ్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.1800 కోట్లతో వాటర్‌గ్రిడ్

- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని అన్ని ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.1800 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకం ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణంలో ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన సిమెంటు ఫ్లోరింగ్, గూడరేవుపల్లెలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, పీలేరు ఎన్టీఆర్ కాలనీలో సీసీ రోడ్లు, సురక్షిత తాగునీటి పథకం బోర్లను సోమవారం ఆయన ప్రారంభించి ప్రజలతో మాట్లాడారు. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ మండలంలో జలాశయం నిర్మించి అక్కడి నుంచి పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల ప్రజలకు ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తారని ప్రకటించారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. తమ ప్రభుత్వం కొలువు దీరిన తొమ్మిది నెలల కాలంలోనే పీలేరు నియోజకవర్గానికి కోట్లాది నిధులు సాధించి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ నాయకులు బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లెల రెడ్డి బాషా, జాఫర్, శ్రీనాథరెడ్డి, షౌకత్ అలీ, చాన్‌బాషా, నల్లారి రియాజ్, కేజీఎన్ రెడ్డిబాషా, కలప రవి, ధనశేఖర్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

- ప్రమాదంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతి





నివాళులర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుగాలి రమ(ప్రక్కన)

సంబేపల్లె/రాయచోటి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుగాలి రమ (56) సోమవారం ఉదయం కారులో వస్తుండగా ఎదురుగా అతి వేగంతో వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె కారులోనే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. సుగాలి రమ పీలేరులో హంద్రీనీవా సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వస్తుండగా సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలోకి రాగానే గల్ఫ్‌కు వెళ్లేందుకు రాయచోటి నుంచి చెన్నై వెళుతున్న కారు అతి వేగంగా వచ్చి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కారును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సుగాలి రమ అక్కడికక్కడే మృతి చెందగా ఆమె కారు డ్రైవర్ ముబారక్, అటెండర్ జీరూనాయక్ మరో కారు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం రాయచోటి ఆసుపత్రికి తరలించారు.

నివాళులర్పించిన మంత్రి మండిపల్లి

పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతి చెందడం చాలా బాధాకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రమ మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. అనంతరం గాయపడిన వారిని మంత్రి పరామర్శించారు.

22 నుంచి సెలవులో వెళ్లనున్న ఎస్పీ

కలికిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఈనెల 22 నుంచి సెలవులో వెళ్లనున్నారు. మే 2వ తేదీ వరకు ఆయనకు సెలవు మంజూరు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. మొత్తం 11 రోజులపాటు విద్యాసాగర్ నాయుడు వ్యక్తిగత పర్యటన కోసం జపాన్ వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పలువురు జడ్జిల బదిలీ

కడప రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ సోమవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి కడప జిల్లా ప్రధాన జడ్జిగా సి.యామిని నియమితులయ్యారు. ఈమె నెల్లూరు జిల్లా ప్రధాన జడ్జిగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై రానున్నారు. కడప జిల్లా ప్రధాన జడ్జిగా పనిచేస్తున్న గొల్ల శ్రీదేవిని అనంతపురం జిల్లా లేబర్‌కోర్టుకు బదిలీ చేశారు. అలాగే జిల్లా కోర్టు సముదాయంలోని ఆరవ అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీ కోర్టు) జడ్జిగా ఎస్.శాంతిని నియమించారు. ఈమె చిత్తూరు జిల్లా కోర్టులో అరవ అదనపు జిల్లా జడ్జి (పోక్సో కోర్టు)గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ అరవ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఇంతియాజ్ అహ్మద్‌ను విజయవాడలోని 14వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీచేశారు.

మోహినీ రూపుడైన పట్టాభిరాముడు

- సూర్య, చంద్రప్రభ వాహనాలపై సీతారామలక్ష్మణులు



సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు



మోహినీ అవతారంలో పట్టాభిరాముడు

వాల్మీకిపురం, ఏప్రిల్ 7: వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారి మోహినీ అవతారం విశేషంగా ఆకట్టుకుంది. టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవాలలో భాగంగా సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై సీతారామలక్ష్మణులకు విశేష పూజల చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాత్రి మోహినీ అవతారంలో పట్టాభిరాముడికి విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సీతారాముల కల్యాణోత్సవానికి టీటీడీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక బైపాస్ రోడ్డులోని టీటీడీ స్థలాలలో ఆరుబయట వేడుకలకు కల్యాణ వేదికతో పాటు భక్తులు వీక్షించేలా భారీ టెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే ఎస్వీబీసీ చానల్ ద్వారా కల్యాణోత్సవం ప్రత్యక్ష ప్రచారం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాల వారీగా వ్యాధులపై అధ్యయనం

- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో ముందడుగు
- జిల్లాలో హైపర్‌టెన్షన్, డయాబెటిక్ కేసులు 59,166

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా మరొక అడుగు ముందుకు వేసింది. వ్యాధులకు చికిత్స అందించడం ఒక భాగమైతే.. అసలు వ్యాధులకు కారణాలు ఏమిటో తెలుసుకోవడం మరో భాగమని గుర్తించిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న గుండె, కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధుల నుంచి డయాబెటిక్, క్యాన్సర్ వంటి రోగాల వరకు ఏ ప్రాంతంలో ఎందుకు ఎక్కువ కేసులు నమోదవుతున్నాయనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం పరిశోధనలు చేసింది. ఈ సందర్భంగా అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా జిల్లాల ప్రజల ఆహారపు అలవాట్లు, జీవన విధానం వ్యాధులపై ఎక్కువగా ప్రభావం చూపుతున్నట్లు గుర్తించారు. కొన్ని రకాల వ్యాధులను అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా నియంత్రిచ్చవచ్చనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సమగ్ర పరిశోధనను చేపట్టింది. రాష్ట్రంలో ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని పరిశోధన, 10 రకాల వ్యాధుల గురించి అధ్యయనం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వివిధ వ్యాధుల నిర్ధారణకు స్క్రీనింగ్ చేయగా కొన్ని వ్యాధులు కొన్ని కొన్ని జిల్లాలలో ఎక్కువ ప్రభావం చూపిస్తున్నట్లు గుర్తించారు. సాధారణంగా ఎక్కువ మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో హైపర్‌టెన్షన్ ముఖ్యంగా చెప్పుకోవచ్చు. రాష్ట్రంలో 18 ఏళ్ల వయసు కన్నా ఎక్కువ ఉన్న 2.15 కోట్లు (మొత్తం జనాభాలో 52.43 శాతం) మందికి స్క్రీనింగ్ చేస్తే అందులో 19.78 లక్షల మందికి (9.2 శాతం) హైపర్ టెన్షన్ నిర్ధారణ అయ్యింది. మగవాళ్ల కంటే.. మహిళలే ఎక్కువగా టెన్షన్ ఎదుర్కొంటున్నారు. 11,40,772 మంది మహిళలకు హైపర్ టెన్షన్ ఉంది. హైపర్‌టెన్షన్, డయాబెటిక్ కేసులు రాష్ట్రంలో అన్నమయ్య జిల్లాలో 59,166 ఉన్నాయి. గుండె సంబంధ కేసులు అన్నమయ్య జిల్లాలో 6175 ఉన్నాయి. క్యాన్సర్ కేసులు జిల్లాలో 3777 ఉన్నాయి. కాలేయ సంబంధ వ్యాధులు జిల్లాలో 1,048 ఉన్నాయి. క్రానిక్ అబ్జెక్టివ్ పల్మనరీ వ్యాధులు జిల్లాలో 2217 ఉన్నాయి. న్యూరో కేసులు జిల్లాలో 2862 ఉన్నాయి. క్రానిక్ కిడ్నీ వ్యాధులు జిల్లాలో 7463 ఉన్నాయి. ఈ పరిశీలన ద్వారా గుర్తించిన సమస్యలను, అందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రజల్లో అవగాహన కల్పించనుంది. ఈ మేరకు సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలు ఎదుర్కొంటున్న వ్యాధులు, తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలపై మాట్లాడారు.

స్టాంపుల కొరత



- నిండుకున్న నిల్వలు.. బయటకు పరుగులు
- ఉన్న చోటా..రెట్టింపు ధరలకు విక్రయాలు
- అక్కరకు రాని ఈ-స్టాంప్స్ ఉన్నా..అరకొరే



మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



కార్యాలయంలో ఏర్పాటు చేసిన నో స్టాక్ బోర్డు

మదనపల్లె, ఏప్రిల్ 7: జిల్లాలో ప్రధాన కేంద్రమైన మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివిధ రకాల స్టాంపుల కొరతతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజులు కాదు..నెలల తరబడి అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్లతో పాటు వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు బయటి కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ కూడా తగినంత నిల్వలు లేకపోవడంతో ఒకటి, రెండు స్టాంపులు చేతిలో పెట్టి పంపుతున్నారు. వీటిలో కీలకమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు డిమాండ్ ఏర్పడటంతో రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-స్టాంప్స్ కూడా అందుబాటులో లేకపోవడంతో భూముల క్రయ, విక్రయాలు, అగ్రిమెంట్లకు అవసరమైన నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే మదనపల్లె ప్రధాన కేంద్రమైన మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపు, స్పెషల్ అడిష్వా, కోర్టు ఫీజు స్టాంపులు, నోటరీ బిల్లులు అందుబాటులో లేవు. దీంతో వివిధ అవసరాల కోసం వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు నెలరోజులుగా అందుబాటులో లేవు. దీంతో భూముల రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్ల కోసం వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా అప్పటి జగన్ ప్రభుత్వం 2022లో ఈ-స్టాంపులను అందుబాటులోకి తెచ్చింది. ఉన్న నాన్ జ్యుడీషియల్ స్టాంపులను నిషేధించి వాటి స్థానంలో మీ-సేవా కేంద్రాలు, కంప్యూటర్, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులకు లైసెన్సులు జారీ చేసింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని తిరిగి కొనసాగిస్తోంది. దీని స్థానంలో ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన ఈ-స్టాంప్స్‌కు ఆదరణ తగ్గింది. అంతవరకు బాగానే ఉన్నాప్రస్తుతం ఈ రెండు రకాల స్టాంపులు కూడా తగినన్ని అందుబాటులో లేవు. రూ.లక్షలు, కోట్లు పెట్టి ఆస్తులు కొనుగోలు చేస్తే వాటిని రిజిస్ట్రేషన్ చేసుకునే క్రమంలో స్టాంపులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత అధికంగా ఉంది. స్టాంపులు ఉండగానే ఇక్కడి అధికారులు, జిల్లా అధికారులకు ఇండెంట్ పెట్టి తెప్పించే బాధ్యతను షరాబు, సబ్ రిజిస్ట్రార్లు తీసుకోవాలి. కానీ ఆ పని చేయడం లేదు. స్టాంపులు లేవని ఒక మాట చెబితే సరిపోతుంది. పైగా తమకు కార్యాలయంలో పని కూడా తగ్గిపోతుందనే భావనలో ఉన్నారు. ఇందుకు కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్ కూడా ఏర్పాటు చేశారు. కానీ అక్కడ నెలరోజులుగా నోస్టాక్ బోర్డు దర్శనమిస్తోంది.

నాన్ జ్యుడీషియల్‌లో రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపులు చలామణిలో ఉన్నాయి. కానీ స్టాకు కొరతతో మొదట్లో రూ.50, రూ.100..తర్వాత రూ.10, రూ.20 కూడా నిండుకున్నాయి. ఈ నేపథ్యంలో చివరకు ఈ-స్టాంపుల మీదనే ఆధారపడాల్సి వచ్చింది. తర్వాత తిరుపతి కేంద్రంగా సరఫరా అయ్యే ఇవి కూడా ఆగిపోయాయి. మొదట్లో జారీ చేసిన స్టాంపు పేపర్లు అక్కడక్కడా కంప్యూటర్ సెంటర్‌లోని వెండర్ల వద్ద ఉన్నా..రూ.100 స్టాంపు, రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. మరికొందరు రూ.100 విలువ చేసే స్టాంపును రూ.150కి విక్రయించారు. ప్రస్తుతం అవి కూడా అందుబాటులో లేవని చెబుతున్నారు. ఉన్నా రెట్టింపు ధర ఇచ్చినా..ఒకటి మాత్రమే ఇస్తున్నారు. అలాగే స్పెషల్ అడిష్వా స్టాంపుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇవి రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100 చలామణిలో ఉండగా, ప్రస్తుతం అవి కూడా అయిదు నెలలుగా ఇక్కడి కార్యాలయంలో అందుబాటులో లేవని చెబుతున్నారు. ఇవి ప్రధానంగా ప్రభుత్వ పథకాలకు అవసరమయ్యే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం, డాక్యుమెంటు నకళ్లు, బ్యాంకు రుణాలు, వ్యవసాయ, హౌసింగ్ రుణాలు, అఫిడవిట్లకు వీటిని వినియోగిస్తున్నారు. వీటి కోసం సాధారణ పౌరులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కోర్టు ఫీజు స్టాంపులు, నోటరీ బిల్లల సరఫరా కూడా ఇలాగే ఉంది. దీంతో వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సాధారణ పౌరులతోపాటు అడ్వకేట్స్ కూడా స్టాంపుల కోసం సమీపంలోని తంబళ్లపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పుంగనూరు, పీలేరు, తదితర కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ చిన్న కేంద్రాలు కావడంతో పెద్దగా సేల్స్ ఉండవని చెబుతుంటారు. కానీ ఇక్కడి వారంతా ఆ కేంద్రాలను ఆశ్రయించడంతో అక్కడ కూడా నిల్వలు నిండుకున్నాయి. ఈ-స్టాంప్స్ తిరుపతి నుంచి సరఫరా చేస్తున్నారు. ఇవి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధం లేదు. కానీ వెండర్లకు వీటిని ఇవ్వడం లేదు. గతంలో జారీ చేసిన పేపర్లు అక్కడక్కడా పరిమిత సంఖ్యలో ఉంటూ..రెట్టింపు ధర అయినా..అవి కూడా కొందరికే అందుతున్నాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంబంధించి డెఫిసిట్ కట్టిస్తే స్టాంపులు ఇస్తామని చెబుతుండగా, అలా చేస్తే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తిరస్కరిస్తున్నారు. చలానా రూపంలోనే డీఎఫ్ చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తామని, ఈ-స్టాంపు రూపంలో లేదని చెబుతున్నారు. దీంతో అక్కడ సరఫరా ఆగిపోగా, ఇక్కడ స్టాంపుల కొరత వెంటాడుతోంది. స్టాంపుల కొరతను స్థానిక సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టామని, వారం రోజుల్లో తగినన్ని, అన్నిరకాల స్టాంపులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

కౌన్సిల్‌లో ఏక పక్ష నిర్ణయాలను రద్దు చేయాలి

● కలెక్టర్‌కు మున్సిపల్ కౌన్సిలర్ల ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు ఏకపక్షంగా చేసుకుంటూ ఏకపక్ష నిర్ణయాలను ఆమోదించుకుంటున్నారని, చట్టబద్ధత లేని కౌన్సిల్ మీటింగ్, నిర్ణయాలను రద్దు చేయాలని కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటికి చెందిన కూటమి కౌన్సిలర్లు 18మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ కమాల్‌బాషా, మరికొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ గత నెల 22వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశానికి తమకు సమాచారం లేదని, అలాగే 24వ తేదీ నిర్వహించిన సమావేశానికీ తమకు సమాచారం లేదన్నారు. కమిషనరు హాజరు కాకుండానే ఇన్‌చార్జి కమిషనర్‌తో పలు అంశాలకు ఆమోదం తెలపడం చట్ట విరుద్ధమన్నారు. కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించిన కౌన్సిల్‌ను, నిర్ణయాలను రద్దు చేయాలని కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, మురళీధర్‌రెడ్డి, జిలాన్‌బాషా, అతిథిదేవి, వరలక్ష్మి, రమాదేవి, దీప్తి తదితరులు డిమాండ్ చేశారు.

చిత్రకళా ఉత్సవంలో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

● మంత్రి నుంచి ప్రశంసలు



మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వైవీయూ విద్యార్థి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో జరిగిన అమరావతి చిత్రకళా ఉత్సవంలో యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగం విద్యార్థుల చిత్రాలు వీక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ప్రతిభ చూపిన వైవీయూ బీఎఫ్ఏ విద్యార్థి డి.ముత్యంకు రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శాలువ కప్పి అభినందించారు. ఈ ఉత్సవంలో విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాదాపు రెండు వందల చిత్రాలను ప్రదర్శించారు. లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్, బి.ఈరప్ప, ప్రదర్శనలో మార్గదర్శకం వహించారు. అలాగే 5వ తేదీన విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, డ్రీం ఆర్ట్ గ్యాలరీ సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన పెయింటింగ్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు దండు మేను ముత్యం, ఆర్.పునీత్ పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీపీపీ చోరీ కేసులో దొంగ అరెస్టు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 7.(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని తాళాలు వేసి ఉన్న క్వార్టర్స్‌లో చోరీకి పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠాను కలమల్ల పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కొండాపురం సీఐ కలమల్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసై, డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో మధ్యప్రదేశ్ థార్ జిల్లా కుక్షి తాలూకా నర్వాలి గ్రామానికి చెందిన గణపత్ ధావర్, మరో ముగ్గురితో కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి ఏపీలోని కర్మాగారాల్లో, పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లలో తొంగతనాలకు పాల్పడేవాడన్నారు. 2025 ఫిబ్రవరి 9, 10వ తేదీల మధ్య రాత్రి సమయాల్లో ఆర్టీపీపీలోని కాలనీల్లో తాళాలు వేసివున్న ఇళ్లల్లో సుమారు రూ.2,40,000 విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారన్నారు. మళ్లీ చోరీలు చేసేందుకు ముద్దనూరు రోడ్డు కొత్తపల్లె క్రాస్ రోడ్డు వద్ద సంచరిస్తుండగా ధావర్‌ను కలమల్ల ఎస్ఐ తిమోతి ఆధ్వర్యంలోని పోలీసు బృందం అరెస్టు చేశారని, మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి వుందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమోతిని, సిబ్బందిని అభినందించారు.

దిగువ చెన్నామర్రి సమీపంలో రికార్డింగ్ డ్యాన్సులు

● డాన్సులకు వినియోగించిన వాహనం సీజ్

● ఇరువురిపై కేసు నమోదు

కురబలకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ దిగువ చెన్నామర్రి సమీపంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించిన వాహనాన్ని సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిగువచెన్నామర్రి గ్రామ సమీపంలోని చింతచెట్టు వద్ద డీజే సౌండ్ సిస్టమ్ పాటలతో హిజ్రాలతో అర్ధరాత్రిలో అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అనుమతులు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో డీజే వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే నిర్వాహకుడు ఎగువచెన్నామర్రికి చెందిన నాగరాజ కుమారుడు నరసింహులు(26), వాహన యజమాని తెట్టు పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన కుళ్ళాయప్ప కుమారుడు మహేష్(42)ను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వర్‌రావు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పులివెందుల, ముద్దనూరు వ్యవసాయ డివిజను పరిధిలోని 9 మండలాల వ్యవసాయాధికారులు, అలాగే రైతు సేవా కేంద్రాల సిబ్బందితో స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు కావాలసిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో పడి వృద్ధుడి మృతి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో స్నానానికి దిగి ఈత రాక ఒక వృద్ధుడు మృతి చెందిన సంఘటన ప్రొద్దుటూరులో జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే.. రామేశ్వరానికి చెందిన చిన్న వెంకటేష్ (73) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయి సోమవారం పెన్నానదిలో శవమై తేలాడు. రూరల్ పోలీసులు నదిలో తేలిన శవాన్ని పైకి తీశారు. చిన్న వెంకటేష్ ప్రతి రోజు గంగమ్మ దేవళం వద్ద వున్న పెన్నానదిలో స్నానం చేసి వెళుతుండేవాడని, నదిలో లోతు ఎక్కువగా వున్నచోట దిగి ఈత రాక మునిగిపోయి మరణించాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక శక్తులపై నిఘా నేత్రం..



● నేత్ర సంచార వాహనంతో నేరస్తులను గుర్తించే అవకాశాలు

● అందుబాటులో అత్యాధునిక సీసీ కెమెరాలు

ప్రజారక్షణలో భాగంగా నూతనంగా ఏర్పాటైన నేత్రవాహనం ఉన్న చోట ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఏదైనా గొడవలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, దొంగతనాలకు పాల్పడినా ఈ నిఘా నేత్రం వారిని ఇట్టే పట్టిస్తుంది. స్పష్టమైన వీడియోల ద్వారా వారిని గుర్తించి నిమిషాల్లో అక్కడున్న పోలీసులకు నేత్ర బృందం సమాచారమిస్తారు. దీంతో నిందితులను నిమిషాల్లోనే పట్టుకుంటారు. ఈ వాహనం వినియోగం వలన నేరాలు తగ్గే అవకాశం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు.



వాహనంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న సిబ్బంది

నిఘా నేత్ర వాహనం



కడప క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా సభలు, సమావేశాలు, తిరునాళ్లు, జాతరలు, సీఎం, మంత్రులు.. ఇతర నాయకుల సభల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచేందుకు కడపలో నిఘా నేత్ర సంచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. 2017లో ఈ వాహనాన్ని ప్రారంభించారు. అయితే వాహనం కొన్ని రోజులు బాగా ఉపయోగించుకున్న అధికారులు తర్వాత ఆ వాహన వినియోగం కనుమరుగైంది. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈ వాహనంపై ప్రత్యేక దృష్టి సారించారు. మరమ్మతులు చేయించడంతో పాటు అత్యాధునిక పరికరాలు, కెమెరాలతో మానిటరింగ్ చేసే విధంగా నూతనంగా ఏర్పాటు చేశారు. ట్రయల్‌గా శివరాత్రికి, పొలతల పుణ్యక్షేత్రాల్లో ఈ వాహనంతో నిఘా ఉంచారు. జేబు దొంగలు, అల్లరిమూకలు, జూదం, చైన్‌స్నాచర్లతో పాటు అనుమానాస్పదంగా తిరిగే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించగలరు. నిందితులను గుర్తించేలా 360 డిగ్రీలు తిరిగే కోణంలో 200 మీటర్ల దూరాన్ని స్పష్టంగా చూపగలిగే పీటీజెడ్ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేశారు. దీంతో పాటు వాహనం చుట్టూ నాలుగు దిక్కులలో కెమెరాలను ఏర్పాటు చేశారు. దాదాపు 200 మీటర్ల దూరంలో మనిషితో పాటు చిన్నపాటి అక్షరాలను సైతం క్యాప్చర్ చేయగల సత్తా ఉన్న కెమెరాలను ఏర్పాటు చేశారు. జనాల మధ్యలో ఈ కెమెరాలను పెట్టి దొంగలను, నేరాలకు పాల్పడే వారిని ఇట్టే గుర్తించే అవకాశం ఉంది.

శ్రీరాముని కల్యాణం సందర్భంగా..

ఒంటిమిట్టలో జరగనున్న కల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రితో పాటు పలువురు నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. కల్యాణ ప్రాంగణంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ఈ వాహనంతో నిఘా ఉంచనున్నారు. ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కెమెరాలే అల్లరి మూకలను పట్టిస్తాయి.

ఒక కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం

ఒక సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుంది. జనాల మధ్యలో నేరస్తులు ఏం చేసినా చిత్రీకరిస్తుంది. దానిని పరిశీలించి వారిని నిమిషాల్లో అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. మనిషి అయినా ఏమరుపాటుగా ఉన్నా నిఘా నేత్రం మాత్రం దాని పరిధిలో ఉన్న వారిని ఒక కంట కనిపెడుతూ తప్పు చేసేవారిని పట్టిస్తుంది.

నేత్ర వాహనం ప్రత్యేకతలు

ఫోర్ ఫిక్స్‌డ్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ కెమెరాస్, 1 పీపీజెడ్ కెమెరా (360 డిగ్రీలు), 200 మీటర్ల వరకు చూడగలరు. 16 ఛానెల్స్ నెట్‌వర్క్, వీడియో రికార్డర్, వైర్‌లెస్ కెమెరా, ఆర్ బాడీవార్మ్ కెమెరాస్, డ్రోన్ కెమెరా, ఈహెచ్ఎఫ్ సెట్ ఫర్ కమ్యూనికేషన్ సిస్టం, రెండు సీసీ టీవీ మానిటర్స్, అలాగే పబ్లిక్ అడ్రస్‌సిస్టం, సైరైన్, జనరేటర్, ఎలక్ట్రికల్ సిస్టం, 24/7 మానిటరింగ్ బై స్పెషలిస్ట్ ఆపరేటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనం ఎక్కువ జనాలు సంచరించే ప్రాంతాల్లో నిఘా ఉంచి జనాల కదలికలను పరిశీలిస్తుంటారు.



వైసీపీ వంచించింది.. కూటమి అండగా నిలిచింది

● ముదివేడు రిజర్వాయర్ భూ బాధితులకు రూ.1.66కోట్లు నష్టపరిహారం ● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతులను వంచించి నష్టపరిహారం చెల్లించకుండా భూములు లాక్కొని దౌర్జన్యంగా ముదివేడు రిజర్వాయర్ పనులు చేపడితే.. కూటమి ప్రభుత్వం ఇప్పుడు నష్టపరిహారం చెల్లించి రైతులకు అండగా నిలుస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ముదివేడు రిజర్వాయర్ పనుల కోసం రైతుల నుంచి 750 ఎకరాలు సేకరించి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన కంపెనీ కొత్తపల్లె, శీతవారిపల్లె, గురికివారిపల్లె, పిచ్చలవారిపల్లె గ్రామాల రైతుల భూములను బలవంతంగా లాక్కొని పనులు చేపట్టిందన్నారు. ఎక్కడైనా పనులు జరిగితే ముందుగా రైతులకు నష్టపరిహారం ఇచ్చి పనులు ప్రారంభిస్తారని, ఇక్కడ మాత్రం రైతులకు వైసీపీ ప్రభుత్వం చిల్లి గవ్వఇవ్వకుండా పనులు చేపట్టి రైతులను నిలువునా ముంచిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు కురబలకోట మండలం అంగళ్ళుకు వచ్చినప్పుడు రైతులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ విషయాన్ని జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి 25 మంది రైతులకు మొదటి విడతగా రూ.1.66 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పరిహారం అందుతుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా తంబళ్లపల్లె నియోజకవర్గ రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసిందన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించే ముదివేడు రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ముదివేడు రైతులకు అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, కురబలకోట మండల పార్టీ కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, సుబ్బినాయుడు, ఫజులు, శంకర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠంలోని జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విడుదల చేశారు. ఈ ఆరాధనోత్సవాలు మే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి, దేవదాయశాఖ అధికారులు, పురోహితులు పాల్గొన్నారు.

బిషప్ పాల్‌ప్రకాశ్ పట్టాభిషేకానికి తరలిరండి

● కడప మేత్రాసన ప్రతినిధులు



కడప కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మరియాపురం డయాసిస్ నూతన బిషప్‌గా సగినాల పాల్ ప్రకాశ్ ఈనెల 9న పట్టాభిషిక్తులు కానున్నారని, ఈ పట్టాభిషేకానికి విశ్వాసులు తరలిరావాలని కడప మేత్రాసన వికర్ జనరల్ బాలరాజు, కోశాధికారి ఫాదర్ సురేశ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మరియాపురంలోని బిషప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మహోత్సవం మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాల ప్రాంగణంలోని అరులయ్య వేదికపై జరగనుందన్నారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిధులుగా వాటికన్ నుండి దూత లియో పోల్డ్ జిరెల్లితో పాటు ప్రధాన అభిషేక పీఠాధిపతిగా హైదరాబాదు మేత్రాసనానికి చెందిన పూల ఆంథోని, సహాయ అభిషేక పీఠాధిపతులుగా గాలిబాలి, నెల్లూరు బిషప్ మోసెస్ డి.ప్రకాశం పాల్గొంటారన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా విజయవాడ మేత్రాసన పీఠాధిపతి జోసెఫ్ రాజారావు, ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి సుమారు 20 మంది బిషప్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి విచారణ గురువు ఆనంద్, ఎర్రగుంట్ల విచారణ గురువు మోజెస్ పాల్గొన్నారు.

పెద్దదర్గాను సందర్శించిన హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి

కడప కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత పెద్దదర్గాను సోమవారం హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి అహ్మద్ అక్బర్ దర్శించుకున్నారు. దర్గాకు చేరుకున్న ఆయనకు దర్గా ప్రతినిధులు సంప్రదాయబద్ధంగా ఆయనకు స్వాగతం పలికారు. దర్గాలోని గురువుల మజార్లను దర్శించిన అనంతరం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువుల పిలుపుతోనే తాను ఈ ప్రాంతానికి చేరుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



కోదండరాముడి సన్నిధిలో పల్లా



ఒంటిమిట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొమరా వెంకటన రసయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, పత్తి సుబ్బరాయుడు, ఆర్.వి.లోకేశ్, గిరీశ్‌కుమార్, చలమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'దైవ కృపతో జిల్లాకు ఢిల్లీస్థాయిలో ఖ్యాతి'

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దైవ కృపతో జిల్లా ఖ్యాతి ఢిల్లీస్థాయిలో ప్రకాశించాలని ప్రకాష్‌నగర్ జీసస్ బ్లెస్సింగ్స్ చర్చి పాస్టర్ ఎస్.విజయ్‌కిషోర్ అన్నారు. సోమవారం చర్చి ఆవరణలో ఇటీవల ఇంటాక్ జాతీయ స్థాయి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా అధిక మెజారిటీతో గెలుపొందిన ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఇంటాక్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు గౌరవం సాధించడంలో చిన్నపరెడ్డికి దేవుని ఆశీస్సులు దండిగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎస్.విజయ్‌కిషోర్‌తో పాటు చర్చి, జేఏసీ సభ్యులు చిన్నపరెడ్డిని ఘనంగా సత్కరించారు. స్థానిక పెద్దలు, చర్చి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నపరెడ్డిని సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు

నుజ్జు అయిన బస్సు ముందు భాగం



తప్పిన ప్రమాదం

దువ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం లారీని వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొంది. పాండిచ్చేరి నుంచి హైదరాబాదు వెళుతున్న బస్సు ఇనుపపైపుల లోడుతో నిలబడి ఉన్న లారీని ఢీకొంది. బస్సు డ్రైవర్ లారీని తప్పించే ప్రయత్నంలో స్టీరింగ్ తిప్పగా రోడ్డును దాటుకుని పొలాల్లోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు అయింది. అందులో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయమై ఎస్ఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు కాలేదని చెప్పారు.

జూదరుల అరెస్టు

● 70,620 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కలకడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళపల్లె పంచాయితీ బొజ్జగుంటపల్లె గోళ్లచెరువు సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ మల్లికార్జున తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 70620 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మరికొందరు పారిపోయినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాసులు, రమేష్‌బాబు, రామ్‌మోహన్, భద్రయ్య పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో ఐదుగురు..

తంబళ్లపల్లె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,860 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్నగారిపల్లె పంచాయతీ చింతలరేవుపల్లెకు సమీపంలోని తిరగరాళ్లగుట్టలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిని పట్టుకోగా, ఎనిమిది మంది పారిపోయినట్లు తెలి పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నేతకు బెదిరింపు కాల్

● కేసు నమోదు

చెన్నూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డిని చంపుతామంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోనులో బెదిరించిన విషయంపై కేసు నమోదు చేసినట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు. గత నెల 23వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఫోనులో పదే పదే హెచ్చరిస్తూ బెదిరించడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో విజయభాస్కర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలతో ఏ ఒక్కరూ బాధపడకూడదు : మంత్రి మండిపల్లి



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని సమస్యలతో ఏ ఒక్కరూ బాధపడకూడదనే ఉద్దేశ్యంతో ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల సమస్యలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది.

నాటుసారా స్వాధీనం - ఒకరి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చెన్నరాజుపోడు క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా నాటు సారా తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ వరుణ్‌కుమార్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు ఓబులవారిపల్లి మండలం చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన బండారు రామచంద్రయ్యను అక్రమంగా నాటుసారా తరలిస్తూ క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం ఉండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలసి అరెస్టు చేసి అతని వద్ద నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ప్రసాద్‌బాబు



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మే నెలలో కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా సోమవారం కడపకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నమయ్య జిల్లాతో పాటు రాయచోటి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామ, మండల నాయకులతో పాటు కార్యకర్తల సంక్షేమానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే పార్టీ బలోపేతానికి, మహానాడు విజయవంతానికి తీసుకోవాల్సిన పలు రకాల అంశాలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా వెంకటేశ్

గాలివీడు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎంపీడీవో సీ.వెంకటేశ్‌కు గాలివీడు ఎంపీడీవో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జవహర్‌బాబు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో సోమవారం వెంకటేశ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

Before the Honourable Deputy Registrar of Chits (O/o District Registrar), At Kadapa

Dispute No. DRK/CF No.99/24

Between

M/s. Shriram Raghavendra Chits Pvt. Ltd., Kadapa Branch ... Disputant

Vs

K.Sivakrishna and Others ... Opponents

Opponent No. OP3 కు నోటీసు

Opponent No.3 : Mr. Mumadi Jaswanth S/o Mumadi Venkata Rama Murthy aged about 32 years, is working Track Maintainer-IV, Engineering Department, Rly. Kodur, Railway Station, Guntakal Division, South Central Railway, YSR District and is Residing at H.No. 3/107, Kotha Bazar, Rly.Kodur, YSR District, Andhra Pradesh.

డిస్‌ప్యూటెంట్ డిస్‌ప్యూట్ బాకీ మొత్తం రూ.1,00,510/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన డిస్‌ప్యూట్ ఆపోనెంటు OP3 అయిన మీరు 23/04/2025వ తేదిన హాజరు గడువుగాను వాయిదా వున్నది. పై దినము 11.00 గం.లకు డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o. ది డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, గౌతమ్ బుద్ధ టౌన్‌షిప్, కడప వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

(By order of)

The Hon'ble Deputy Registrar of Chits/ Arbitrator. Dist. Registrar and Stamps Department, Near Goutham Budda Township, Kadapa.

మండుటెండల్లో ఉపాధి పనులు

- పనులు చేసే ప్రదేశాల్లో సౌకర్యాలు నిల్
- ఇబ్బందుల్లో కూలీలు
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు, మంచినీరు
- నిబంధనలు తుంగలో తొక్కిన సిబ్బంది



కస్తూరిరాజుగారిపల్లె చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): అసలే రాయచోటి నియోజకవర్గంలోని మండలాల్లో ఎలాంటి ప్రాజెక్టులు, నీటి వసతులు లేవు. ప్రజలు జీవనాధారం కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కొండలు, పొలాల్లో పనులు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పనుల వద్దనే మెడికల్ కిట్లు, మజ్జిగ, ఐదు లీటర్ల మంచినీరు, టెంటు, ఓఆర్ఎస్‌లను ఏర్పాటు చేయాలని ఉపాధి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. అయితే ఉపాధి సిబ్బంది వీటన్నింటినీ తుంగలో తొక్కేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ పథకం వద్ద మెడికల్ కిట్లు గానీ, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, మంచి నీళ్లు పెట్టిన పాపాన పోలేదని వారు ఆరోపిస్తున్నారు. అసలే ఉదయం 8 గంటల నుంచి విపరీతంగా ఎండలు మండుతున్నాయి. చాలా మంది ఉపాధి సిబ్బంది వడదెబ్బకు గురై ఆసుపత్రులకు పాలవుతున్నారు.

మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో రోజుకు 2 వేల నుంచి 3 వేల మంది ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. అయితే ఇంటి వద్ద నుంచే నీళ్లు తీసుకెళ్లడం తప్ప ఎలాంటి నిలవడానికి నీడకూడా ఎక్కడా లేదు. ఎండలోనే పని చేస్తూ వడదెబ్బలకు గురవుతున్నారు. ప్రభుత్వం అదనంగా ఒక్క రూపాయి పెంచింది. దీంతో ఒక కూలీకి దినసరి కూలి రూ.300 పైగా కల్పించింది. అయితే ఉపాధి సిబ్బంది మాత్రం నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు గడ్డపార, ఇతర వస్తువులు ఏదైనా తగిలి గాయాలైతే ప్రథమ చికిత్స కిట్ కూడా లేదని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఉపాధి సిబ్బంది వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లలో అధిక పేర్లు ఎక్కించుకొని డబ్బులు వసూలు చేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. వారమంతా కష్టపడి బిల్లు వచ్చిన వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఖచ్చితంగా ముడుపులు చెల్లించాల్సిందేనని కూలీలు వాపోతున్నారు.

అన్ని వసతులు కల్పిస్తాం - ఏపీవో ఢిల్లీబాబు

ఏప్రిల్ నుంచి 16 గ్రామ పంచాయతీల్లో జరిగే ఉపాధి హామీ పథకం పనుల వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నాం. తాగునీరు కూలీలు తెచ్చుకుంటున్నారని, మజ్జిగ, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. కూలీలకు సరైన అన్ని వసతులు అందుబాటులో పెడతాం.

నిలవడానికి నీడ కూడా లేదు

- ఆదినారాయణమ్మ, ఉపాధి కూలీ



కొన్నేళ్ల నుంచి ఉపాధి హామీ పథకం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పనుల వద్ద ఎలాంటి నీడ లేదు. భోజనం చేసే సమయంలో అలాగే ఎండలోనే తింటున్నాం. నీళ్లు తీసుకెళుతున్నాం. పనుల వద్ద మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ లాంటివి ఏమీ ఉండవు.

సకాలంలో బిల్లులు రావడం లేదు

- ఇందిరమ్మ, ఉపాధి కూలీ, గాండ్లపల్లి



అసలే ఎండల కాలం. ఉదయం 8 గంటల నుంచి ఎండలు మండుతున్నాయి. అయినా ఎండలోనే పనులు చేస్తున్నాం. పనుల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. మేము వెంట తీసుకెళ్లిన నీటితోనే కాలం గడుపుతున్నాం. మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏమీ ఇవ్వడం లేదు. బిల్లులు కూడా సకాలంలో అందించడం లేదు. ఎండాకాలంలో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏర్పాటు చేయాలి.

చదువుతోనే విద్యార్థులకు భవిష్యత్తు

- ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చదువుకుంటేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 42వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, వివేకానందస్వామి తదితరులను ఆదర్శంగా తీసుకుని యువత దేశానికి ఉపయోగపడాలని తెలిపారు. త్వరలో 6 లైన్ల రోడ్డు త్వరలో ప్రారంభం కాబోతోందని, అలాగే స్కిల్ హబ్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కాలను ఘనంగా సత్కరించారు. విద్యార్థిని, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. అదే విధంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.భాస్కర్‌రెడ్డి, కె.బుడుగుంటపల్లె సర్పంచ్ డి.చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శేఖర్, కూటమి నాయకులు కె.సుబ్బరామిరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.రమేష్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు తనిఖీ



పనులను తనిఖీ చేస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

సిద్దవటం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట సీతారాముల బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారిలో రోడ్డుకిరువైపుల ఉన్న పారిశుధ్యాన్ని, ప్లాస్టిక్ వంటి పదార్థాలు తొలగింపు పనులను భాకరాపేట, బొగిడివారిపల్లె, కనుమలోపల్లె గ్రామాల్లో జరుగుతున్న పనులను పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం డీపీవో భాకరాపేటలో మాట్లాడుతూ ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కడప-చెన్నై జాతీయ రహదారి జేఎంజే కళాశాల సమీపం నుంచి ఒండిమిట్ట గ్రామం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అపరిశుభ్రత ప్రాంతాలను బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకుని గత మూడు రోజులుగా పనులు కొనసాగుతున్నాయని పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో విజయభాస్కర్, మండల విస్తరణాధికారి మెహతాజ్ యాస్మిన్, పంచాయతీ సెక్రటరీలు రాజేష్, శివయ్య, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీనరసయ్యకు షోకాజ్ నోటీసులు అందజేసినట్లు కడప పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా పంచాయతీలోని ప్రధాన రహదారిలో పారిశుధ్య పనులు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. తన విధులను సక్రమంగా నిర్వర్తించలేనందున 1991 నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీనరసయ్యకు షోకాజ్ నోటీసులు అందించినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభదాయకం



రైతులకు నవధాన్యాల కిట్టును అందజేస్తున్న ఏడీఏ

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాలు సాగు చేస్తే రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని లక్కిరెడ్డిపల్లె ఏడీఏ జయరాణి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం అధికారుల ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లె ఆర్‌బీకే కార్యాలయంలో 30 రకాల నవధాన్యాల తయారు చేసి 400 ప్యాకెట్లను తయారు చేసి ఒక్కో ప్యాకెట్ 12.50 కిలోల కిట్టును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు రూ.వెయ్యి చొప్పున రైతులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రమేశ్‌బాబురావు, అగ్రికల్చర్ క్షేత్రస్థాయి సిబ్బంది మోడల్ మేకర్ సరస్వతి, అంజనమ్మ, మండల యూనిట్ సభ్యులు గంగిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, షాహీర్, నాగమణి, లక్ష్మి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష అవగాహనపై శిక్షణ

రామాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రామాపురం ఆదర్శ పాఠశాలలో ఈ నెల 20న జరగబోయే 6వ తరగతి ప్రవేశ పరీక్షపై విద్యార్థులకు అవగాహనపై సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు. మోడల్ స్కూల్ 6వ తరగతిలో ప్రవేశం కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష రోజు విద్యార్థులు పరీక్ష ఎలా రాయాలి అనే విషయంపై దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

సుండుపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాయవరం పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డకు 21 సంవత్సరాలు, మగవారికి 25 సంవత్సరాలు వచ్చేంతవరకు పెళ్లి చేయవద్దని తెలియజేశారు. అలాకాకుండా ముందుగా పెళ్లిళ్లు చేయడం వలన గర్భం దాల్చితే తల్లి, బిడ్డ అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని తెలియజేశారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రుబీనా, ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవితం ముఖ్యం : వైద్యులు

నందలూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవితంతో ఆశాజనక భవిష్యత్ ఉంటుందని మండల ప్రభుత్వ వైద్యులు శరత్‌కమల్, కార్తీక్ విశ్వనాధ్‌లు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఆరిఫ్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచండి

పుల్లంపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాలని ఎంఈవో చక్రధర్‌రాజు తెలిపారు. సోమవారం దళవాయిపల్లె గ్రామంలో పాఠశాల చైర్మన్‌తో కలిసి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్ఏల గోడు పట్టించుకోండి

- ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతి



ఇన్‌చార్జి తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్ఏలు

సిద్దవటం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జి తహసీల్దారు మాధవిలతకు వీఆర్ఏలు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఏలు సోమవారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు రెవెన్యూ సహాయకుల జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి మండల కేంద్రమైన సిద్దవటంలో సోమవారం మాట్లాడుతూ జిల్లా, మండల వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకులు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ బరువై అవస్థలు పడుతున్నారని, పే స్కేలు రూ.26 వేలు వేతనాలు అమలు విధానం వీఆర్ఏలకు హక్కు. పౌరసత్వం రెవెన్యూ కార్యాలయాల్లో రాత్రిపూట డ్యూటీ రద్దు చేసి అర్హులైనవారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని వీఆర్ఏల గోడు పట్టించుకోవాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని లేనిపక్షంలో దశలవారీగా మా సమస్యల కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ మండల అధ్యక్షుడు దేవదాసు, కోశాధికారి అమరావతి, కార్యదర్శి రమణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు టీడీపీ నాయకుల స్వాగతం



మంత్రులకు స్వాగతం పలుకుతున్న మండల నాయకులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, సవితలకు మండల తెదేపా అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సీనియర్ నాయకులు ఎస్వీ రమణలు ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం రాష్ట్ర మంత్రులు కోదండరాముని బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను, కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఒంటిమిట్టకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారికి మండల పార్టీ తరపున స్వాగతం పలికారు. మండల నాయకులు చింతగింజల సుబ్రమణ్యం, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభ్రమైన గ్రామాలతో ఆరోగ్యకరమైన జీవితం

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఈడీ



సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఈడీ ఊర్మిళ

సుండుపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శుభ్రమైన గ్రామాలతో ప్రజలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడమే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లక్ష్యమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఈడీ ఊర్మిళ తెలిపారు. సోమవారం మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అందుకు మండలాల్లో పంచాయతీ అధికారులు శిబిరాలను సైతం నిర్వహిస్తోందన్నారు. ప్రతిరోజు గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించిన చెత్తతో ఎరువులను తయారు చేసి రైతులకు పంపిణీ చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో మస్తాన్‌వలి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంమోహన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముక్కావారిపల్లె ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించినట్లు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వైద్యసేవల కోసం వచ్చిన వారితో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రూపా, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- ప్రిన్సిపల్ డీఆర్ హరిత

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఏప్రిల్ 7 నుంచి ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ డీఆర్ హరిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థిని విద్యార్థులు వారి హాల్‌టికెట్, ఆధార్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో, ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు పొందాలని తెలిపారు.

'భూకబ్జాదారుల ఆటలు కట్టించండి'

రాజంపేటటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలంలో పలు ప్రాంతాల్లో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారని, వారి ఆటలు కట్టించాలని సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు సీపీఐ నేతలు నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు చింతలపూరి నాగమ్మ, పి.మహేష్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీపీఐ నేతలు చిన్నయ్య, సికిందర్, శివయ్య, నాగేశ్వరరావు, రమణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో ఏక పక్ష నిర్ణయాలను రద్దు చేయాలి

● కలెక్టర్‌కు మున్సిపల్ కౌన్సిలర్ల ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు ఏకపక్షంగా చేసుకుంటూ ఏకపక్ష నిర్ణయాలను ఆమోదించుకుంటున్నారని, చట్టబద్ధత లేని కౌన్సిల్ మీటింగ్, నిర్ణయాలను రద్దు చేయాలని కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన కూటమి కౌన్సిలర్లు 18మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ కమాల్‌బాషా, మరికొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ గత నెల 22వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశానికి తమకు సమాచారం లేదని, అలాగే 24వ తేదీ నిర్వహించిన సమావేశానికీ తమకు సమాచారం లేదన్నారు. కమిషనరు హాజరు కాకుండానే ఇన్‌చార్జి కమిషనర్‌తో పలు అంశాలకు ఆమోదం తెలపడం చట్ట విరుద్ధమన్నారు. కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించిన కౌన్సిల్‌ను, నిర్ణయాలను రద్దు చేయాలని కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, మురళీధర్‌రెడ్డి, జిలాన్‌బాషా, అతిథిదేవి, వరలక్ష్మి, రమాదేవి, దీప్తి తదితరులు డిమాండ్ చేశారు.

చిత్రకళా ఉత్సవంలో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

● మంత్రి నుంచి ప్రశంసలు



మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వైవీయూ విద్యార్థి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో జరిగిన అమరావతి చిత్రకళా ఉత్సవంలో యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగం విద్యార్థుల చిత్రాలు వీక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ప్రతిభ చూపిన వైవీయూ బీఎఫ్ఏ విద్యార్థి డి.ముత్యంకు రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శాలువ కప్పి అభినందించారు. ఈ ఉత్సవంలో విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాదాపు రెండు వందల చిత్రాలను ప్రదర్శించారు. లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్, బి.ఈరప్ప, ప్రదర్శనలో మార్గదర్శకం వహించారు. అలాగే 5వ తేదీన విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, డ్రీం ఆర్ట్ గ్యాలరీ సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన పెయింటింగ్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు దండు మేను ముత్యం, ఆర్.పునీత్ పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 7.(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని తాళాలు వేసి ఉన్న క్వార్టర్స్‌లో చోరీకి పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠాను కలమల్ల పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కొండాపురం సీఐ కలమల్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసై, డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో మధ్యప్రదేశ్ థార్ జిల్లా కుక్షి తాలూకా నర్వాలి గ్రామానికి చెందిన గణపత్ ధావర్, మరో ముగ్గురితో కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి ఏపీలోని కర్మాగారాల్లో, పెద్దపెద్ద అపార్టమెంట్లలో దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. 2025 ఫిబ్రవరి 9, 10వ తేదీల మధ్య రాత్రి సమయాల్లో ఆర్టీపీపీలోని కాలనీల్లో తాళాలు వేసివున్న ఇళ్లల్లో సుమారు రూ.2,40,000 విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారన్నారు. మళ్లీ చోరీలు చేసేందుకు ముద్దనూరు రోడ్డు కొత్తపల్లె క్రాస్ రోడ్డు వద్ద సంచరిస్తుండగా ధావర్‌ను కలమల్ల ఎస్ఐ తిమోతి ఆధ్వర్యంలోని పోలీసు బృందం అరెస్టు చేశారని, మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి వుందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమోతిని, సిబ్బందిని అభినందించారు.

దిగువ చెన్నామర్రి సమీపంలో రికార్డింగ్ డ్యాన్సులు

● డ్యాన్సులకు వినియోగించిన వాహనం సీజ్

● ఇరువురిపై కేసు నమోదు

కురబలకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ దిగువ చెన్నామర్రి సమీనంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించిన వాహనాన్ని సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిగువచెన్నామర్రి గ్రామ సమీపంలోని చింతచెట్టు వద్ద డీజే సౌండ్ సిస్టమ్ పాటలతో హిజ్రాలతో అర్ధరాత్రిలో అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అనుమతులు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో డీజే వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే నిర్వాహకుడు ఎగువచెన్నామర్రికి చెందిన నాగరాజ కుమారుడు నరసింహులు(26), వాహన యజమాని తెట్టు పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన కుళ్ళాయప్ప కుమారుడు మహేష్(42)ను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వర్‌రావు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పులివెందుల, ముద్దనూరు వ్యవసాయ డివిజను పరిధిలోని 9 మండలాల వ్యవసాయాధికారులు, అలాగే రైతు సేవా కేంద్రాల సిబ్బందితో స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు కావాలసిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో పడి వృద్ధుడి మృతి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో స్నానానికి దిగి ఈత రాక ఒక వృద్ధుడు మృతి చెందిన సంఘటన ప్రొద్దుటూరులో జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే.. రామేశ్వరానికి చెందిన చిన్న వెంకటేష్ (73) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయి సోమవారం పెన్నానదిలో శవమై తేలాడు. రూరల్ పోలీసులు నదిలో తేలిన శవాన్ని పైకి తీశారు. చిన్న వెంకటేష్ ప్రతి రోజు గంగమ్మ దేవళం వద్ద వున్న పెన్నానదిలో స్నానం చేసి వెళుతుండేవాడని, నదిలో లోతు ఎక్కువగా వున్నచోట దిగి ఈత రాక మునిగిపోయి మరణించాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక శక్తులపై నిఘా నేత్రం..

● నేత్ర సంచార వాహనంతో నేరస్తులను గుర్తించే అవకాశాలు

● అందుబాటులో అత్యాధునిక సీసీ కెమెరాలు

ప్రజారక్షణలో భాగంగా నూతనంగా ఏర్పాటైన నేత్రవాహనం ఉన్న చోట ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఏదైనా గొడవలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, దొంగతనాలకు పాల్పడినా ఈ నిఘా నేత్రం వారిని ఇట్టే పట్టిస్తుంది. స్పష్టమైన వీడియోల ద్వారా వారిని గుర్తించి నిమిషాల్లో అక్కడున్న పోలీసులకు నేత్ర బృందం సమాచారమిస్తారు. దీంతో నిందితులను నిమిషాల్లోనే పట్టుకుంటారు. ఈ వాహనం వినియోగం వలన నేరాలు తగ్గే అవకాశం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు.



వాహనంలో సీసీ ఫుటేజిని పరిశీలిస్తున్న సిబ్బంది

నిఘా నేత్ర వాహనం



కడప క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా సభలు, సమావేశాలు, తిరునాళ్లు, జాతరలు, సీఎం, మంత్రులు.. ఇతర నాయకుల సభల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచేందుకు కడపలో నిఘా నేత్ర సంచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. 2017లో ఈ వాహనాన్ని ప్రారంభించారు. అయితే వాహనం కొన్ని రోజులు బాగా ఉపయోగించుకున్న అధికారులు తర్వాత ఆ వాహన వినియోగం కనుమరుగైంది. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈ వాహనంపై ప్రత్యేక దృష్టి సారించారు. మరమ్మతులు చేయించడంతో పాటు అత్యాధునిక పరికరాలు, కెమెరాలతో మానిటరింగ్ చేసే విధంగా నూతనంగా ఏర్పాటు చేశారు. ట్రయల్‌గా శివరాత్రికి, పొలతల పుణ్యక్షేత్రాల్లో ఈ వాహనంతో నిఘా ఉంచారు. జేబు దొంగలు, అల్లరిమూకలు, జూదం, చైన్‌స్నాచర్లతో పాటు అనుమానాస్పదంగా తిరిగే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించగలరు. నిందితులను గుర్తించేలా 360 డిగ్రీలు తిరిగే కోణంలో 200 మీటర్ల దూరాన్ని స్పష్టంగా చూపగలిగే పీటీజెడ్ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేశారు. దీంతో పాటు వాహనం చుట్టూ నాలుగు దిక్కులలో కెమెరాలను ఏర్పాటు చేశారు. దాదాపు 200 మీటర్ల దూరంలో మనిషితో పాటు చిన్నపాటి అక్షరాలను సైతం క్యాప్చర్ చేయగల సత్తా ఉన్న కెమెరాలను ఏర్పాటు చేశారు. జనాల మధ్యలో ఈ కెమెరాలను పెట్టి దొంగలను, నేరాలకు పాల్పడే వారిని ఇట్టే గుర్తించే అవకాశం ఉంది.

శ్రీరాముని కల్యాణం సందర్భంగా..

ఒంటిమిట్టలో జరగనున్న కల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రితో పాటు పలువురు నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. కల్యాణ ప్రాంగణంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ఈ వాహనంతో నిఘా ఉంచనున్నారు. ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కెమెరాలే అల్లరి మూకలను పట్టిస్తాయి.

ఒక కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం

ఒక సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుంది. జనాల మధ్యలో నేరస్తులు ఏం చేసినా చిత్రీకరిస్తుంది. దానిని పరిశీలించి వారిని నిమిషాల్లో అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. మనిషి అయినా ఏమరుపాటుగా ఉన్నా నిఘా నేత్రం మాత్రం దాని పరిధిలో ఉన్న వారిని ఒక కంట కనిపెడుతూ తప్పు చేసేవారిని పట్టిస్తుంది.

నేత్ర వాహనం ప్రత్యేకతలు

ఫోర్ ఫిక్స్‌డ్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ కెమెరాస్, 1 పీపీజెడ్ కెమెరా (360 డిగ్రీలు), 200 మీటర్ల వరకు చూడగలరు. 16 ఛానెల్స్ నెట్‌వర్క్, వీడియో రికార్డర్, వైర్‌లెస్ కెమెరా, ఆర్ బాడీవార్న్ కెమెరాస్, డ్రోన్ కెమెరా, ఈహెచ్ఎఫ్ సెట్ ఫర్ కమ్యూనికేషన్ సిస్టం, రెండు సీసీ టీవీ మానిటర్స్, అలాగే పబ్లిక్ అడ్రస్‌సిస్టం, సైరెన్, జనరేటర్, ఎలక్ట్రికల్ సిస్టం, 24/7 మానిటరింగ్ బై స్పెషలిస్ట్ ఆపరేటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనం ఎక్కువ జనాలు సంచరించే ప్రాంతాల్లో నిఘా ఉంచి జనాల కదలికలను పరిశీలిస్తుంటారు.



వైసీపీ వంచించింది.. కూటమి అండగా నిలిచింది

● ముదివేడు రిజర్వాయర్ భూ బాధితులకు రూ.1.66కోట్లు నష్టపరిహారం ● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతులను వంచించి నష్టపరిహారం చెల్లించకుండా భూములు లాక్కొని దౌర్జన్యంగా ముదివేడు రిజర్వాయర్ పనులు చేపడితే.. కూటమి ప్రభుత్వం ఇప్పుడు నష్టపరిహారం చెల్లించి రైతులకు అండగా నిలుస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ముదివేడు రిజర్వాయర్ పనుల కోసం రైతుల నుంచి 750 ఎకరాలు సేకరించి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన కంపెనీ కొత్తపల్లె, శీతవారిపల్లె, గురికివారిపల్లె, పిచ్చలవారిపల్లె గ్రామాల రైతుల భూములను బలవంతంగా లాక్కొని పనులు చేపట్టిందన్నారు. ఎక్కడైనా పనులు జరిగితే ముందుగా రైతులకు నష్టపరిహారం ఇచ్చి పనులు ప్రారంభిస్తారని, ఇక్కడ మాత్రం రైతులకు వైసీపీ ప్రభుత్వం చిల్లి గవ్వఇవ్వకుండా పనులు చేపట్టి రైతులను నిలువునా ముంచిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు కురబలకోట మండలం అంగళ్ళుకు వచ్చినప్పుడు రైతులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ విషయాన్ని జిల్లా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి 25 మంది రైతులకు మొదటి విడతగా రూ.1.66 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పరిహారం అందుతుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా తంబళ్లపల్లె నియోజకవర్గ రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసిందన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించే ముదివేడు రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ముదివేడు రైతులకు అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, కురబలకోట మండల పార్టీ కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, సుబ్బినాయుడు, ఫజులు, శంకర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోడల్ నర్సరీ ఏర్పాటుకు విత్తనాల సేకరణ

● సిద్దవటం రేంజర్ కళావతి



కొండ ప్రాంతాల్లో విత్తనాలను సేకరిస్తున్న రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నోడల్ నర్సరీ ఏర్పాటు కోసం సిద్దవటం రేంజ్ గొల్లపల్లె బీట్‌లోని అటవీ ప్రాంతంలో విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించామని రేంజర్ కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మార్చి 21న అంతర్జాతీయ అటవీశాఖ దినోత్సవం సందర్భంగా కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్, కడప నేటివ్ ఫారెస్ట్ రీస్టోరేషన్ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. అందులో భాగంగా డీఎఫ్‌వో ఆదేశాల మేరకు నోడల్ నర్సరీని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో సిద్దవటం రేంజ్‌లోని స్థానిక అటవి జాతి మొక్కల విత్తనాలను సేకరిస్తున్నామన్నారు. వీటి విత్తనాలతో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలతో ఫారెస్ట్‌లో పచ్చదనాన్ని పెంచడానికి ఉపయోగిస్తామన్నారు. అలాగే ప్రజలకు కూడా పంపిణీ చేస్తామని రేంజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఓబులేశు, ఎఫ్‌బీవోలు విశ్వనాథ్, పెంచల్‌రెడ్డి, ఏబీవో హైమావతి, మరికొందరు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో భారీ చోరీ

● ఏడు కిలోల వెండి, 40గ్రాముల బంగారు, 20వేల నగదు అపహరణ

● ఉలిక్కిపడిన బి.కొత్తకోట పట్టణవాసులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ నడిబొడ్డున జరిగిన భారీ చోరీ పట్టణ ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. బీరంగి పంచాయతీ శంకరాపురం జడ్పీహైస్కూల్‌లో తెలుగుమాస్టారుగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్, పీటీయం మండలంలోని పులికల్లు జడ్పీహైస్కూల్‌లో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తన భార్య అనితతో కలిసి బి.కొత్తకోటలోని సంతబజారులో నివాసం వుంటున్నాడు. వీరిద్దరూ పదవతరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం కోసం ఈనెల 3న ఇంటికి తాళాలు వేసుకొని రాయచోటికి వెళ్లారు. దీంతో అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ లేరని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు అదును చూసి కిరణ్‌కుమార్ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. ఇంటి తాళాలు పగులగొట్టినట్టు చుట్టుప్రక్కలవారు సమాచారం ఇవ్వడంతో సోమవారం బాధితకుటుంబం బి.కొత్తకోటకు చేరుకొని చూడగా భారీ చోరీ జరిగినట్టు గుర్తించారు. బీరువా పగులగొట్టి సుమారు 7కిలోల వెండి, రూ.20వేల నగదుతో పాటు 40 గ్రాముల బంగారునగలు, ఆస్తికి సంబంధించిన పత్రాలను సైతం ఎత్తుకెళ్లినట్లు బాధిత ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై స్పందించిన సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. ఇంటికి వచ్చి వెళ్లే మార్గాలలో అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజిలను పరిశీలించడంతో పాటు దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ

● ఇరువురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

ములకలచెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మండలం బండమీదపల్లెకు చెందిన రామాంజనేయులు(42), ముత్యాలు(42) ద్విచక్రవాహనంలో తిరుపతి జిల్లా చంద్రగిరిలోని యల్లమ్మ అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. ములకలచెరువు సమీపంలోని గాలేటివారిపల్లె వద్దకు వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో పోలీసులు తమ వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,860 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్నగారిపల్లె పంచాయతీ చింతలరేవుపల్లెకు సమీపంలోని తిరగరాళ్లగుట్టలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిని పట్టుకోగా, ఎనిమిది మంది పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నుజ్జు అయిన బస్సు ముందు భాగం



తప్పిన ప్రమాదం

దువ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం లారీని వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొంది. పాండిచ్చేరి నుంచి హైదరాబాదు వెళుతున్న బస్సు ఇనుపపైపుల లోడుతో నిలబడి ఉన్న లారీని ఢీకొంది. బస్సు డ్రైవర్ లారీని తప్పించే ప్రయత్నంలో స్టీరింగ్ తిప్పగా రోడ్డును దాటుకుని పొలాల్లోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు అయింది. అందులో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయమై ఎస్ఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు కాలేదని చెప్పారు.

జూదరుల అరెస్టు

● రూ.70,620 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కలకడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళపల్లె పంచాయితీ బొజ్జగుంటపల్లె గోళ్లచెరువు సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ మల్లికార్జున తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 70620 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మరికొందరు పారిపోయినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాసులు, రమేష్‌బాబు, రామ్‌మోహన్, భద్రయ్య పాల్గొన్నారు.

ఎర్రచందనం పట్టివేత

● స్మగ్లర్ అరెస్టు

పీలేరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కారుతో సహా రూ.12 లక్షల విలువగల ఎర్రచందనం పట్టుకున్నట్లు పీలేరు ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. సోమవారం పీలేరు ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శేషాచలం అడవుల నుంచి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమల మండలం కందూరు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. కలికిరి వైపు నుంచి వస్తున్న మహీంద్ర కారును ఆపడానికి ప్రయత్నించగా అతివేగంగా చౌడేపల్లె వైపు వెళ్లడంతో, ఆ వాహనాన్ని వెంబడించి ఎర్రనాగులపల్లె వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఓ స్మగ్లర్ పరారు కాగా కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన సయ్యద్ ఆరిఫ్అహ్మద్(35)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన కారులో 250 కిలోల బరువు గల 8 ఎర్రచందనం దుంగలను గుర్తించినట్లు తెలిపారు. కారుతో సహా ఎర్రచందనాన్ని, స్మగ్లర్‌ను పీలేరు ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించినట్లు తెలిపారు. పారిపోయిన స్మగ్లర్ తమిళనాడుకు చెందిన దశరథన్‌గా గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్వో చంద్రశేఖర్, బీట్ ఆఫీసర్ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధి కోసం పని చేస్తూ ఫలితాలను చూపిస్తున్నామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో పిడికెడు మట్టిపని కూడా చేయలేదని గుర్తు చేశారు. జనవరి నుంచి కేవలం నాలుగు నెలల్లో నియోకవర్గంలో ప్రతి మండలంలోనూ రూ.కోటికి పైగా విలువైన సీసీ రోడ్లు వేయించామన్నారు. రాబోయే రోజుల్లో అన్ని నివాస ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయిస్తామన్నారు. కలికిరి పంచాయతీలోని అండేకురవ పల్లె, యల్లమ్మ ఆలయం వెనుక వైపు, టీబీ రోడ్డు, మంగమ్మ కాలనీ, సత్యాపురం తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు, మురుగు కాలువలను సోమవారం ఆయన ప్రారంభించారు. తన సోదరుడు కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా డబుల్ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించగా, గత ఐదేళ్లలో వాటిని పాడుచేశారని ఆరోపించారు. రెండు నెలల్లో అన్ని తారు రోడ్లకు మరమ్మతులు చేయించామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచు ఆర్. ఎల్లయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, రాజంపేట టీడీపీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, ఎంపీడీవో భానుమూర్తి రావు, కార్యదర్శి అశోక్, వార్డు సభ్యుడు సనావుల్లా, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మాలతి, శ్రీనివాస వర్మ, అఫ్రోజ్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు: వైశ్య కుల గురువు, కర్ణాటకలోని ఫలదిపూర్‌కు చెందిన వామనాశ్రమ మహా స్వామిజీ నేతృత్వంలో సోమవారం పీలేరులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష పుష్పార్చన చేశారు. ఆర్యవైశ్య సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక నెహ్రూ బజారులోని వాసవీ అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గ్రామోత్సవం నిర్వహించి ఆర్యవైశ్య కళ్యాణమండపానికి చేర్చారు.



సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు నివాళి

పీలేరు: సంబేపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హంద్రీ-నీవా పథకం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతదేహానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నివాళులు అర్పించారు. రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకున్న పీలేరు పట్టణంలో కార్యక్రమాలను త్వరగా ముగించుకుని రాయచోటికి తరలి వెళ్లారు. అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రమ మృతదేహానికి పూలమాల అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పీలేరులో విధుల్లో చేరిన ఆమె పారదర్శకంగా పనిచేశారన్నారు. ఎన్నికల అనంతరం పీలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారిణిగా అభివృద్ధి పనుల అమలులోనూ చురుగ్గా పనిచేశారన్నారు. ఆయన వెంట పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఆమె మృతికి జనసేన పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్ సంతాపం వ్యక్తం చేశారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

పీలేరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములు సోమవారం సాయంత్రం గరుడ వాహనంపై పీలేరు వీధుల్లో విహరించారు. కల్యాణోత్సవం అనంతరం సుందరంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామివార్లను ఆశీనులను చేసి స్థానిక నెహ్రూ బజారు, పాత బస్టాండు మీదుగా ఎల్‌బీఎస్ రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు నంద్యాల మణి, మణి, రవి, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా అమ్మినేని వీధిలోని కోదండ రామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన వెండి ఆభరణాలను వేలం వేశారు. డాక్యుమెంట్ రైటర్ రంగు గుణస్వామి అమ్మవారి వెండి గొలుసును రూ. 16 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, టీడీపీ నేత మార్పూరి సుధాకర్ నాయుడు, టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్ నాయుడు, జ్ఞానోదయ కామకోటి ప్రసాదరావు పాల్గొన్నారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కల్యాణోత్సవం, ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది విజయభారతి హైస్కూల్ విద్యార్థులు హనుమాన్ చాలీసాను పఠించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు జోలపాళెం భవానీ ప్రసాద్, దుగ్గిరెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్, చిన్నప్పయ్య, దేవేంద్ర పర్యవేక్షించారు. సొసైటీ కాలనీలోని కోదండ రామాలయాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దర్శించుకున్నారు. కాట్లాటపల్లె రోడ్డులోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి మండలంలోని మల్లెల గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామిని ఊరేగించారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు.



పీలేరు: గరుడ వాహనంపై ఊరేగుతున్న సీతారామచంద్రులు



మదనపల్లె: కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సుధాకర్ నాయుడు

నేడు పీలేరు మండల సమావేశం

పీలేరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పీలేరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. అధికారులు అభివృది కార్యక్రమాలకు సంబంధించిన సమాచారంతో హాజరు కావాలన్నారు.

నేడు వాల్మీకిపురానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్

వాల్మీకిపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మంగళవారం వాల్మీకిపురం మండలంలో పర్యటించనున్నట్లు వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రూ.కోటిపైగా నిధులతో మండలంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు తప్పక హాజరు కావాలని కోరారు. మంగళవారం రాత్రికి సీతారాముల కల్యాణోత్సవాల్లో పాల్గొంటారన్నారు.

మదనపల్లి కోర్టుకు తెలుగు తమ్ముళ్లు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వంలో అన్నమయ్య జిల్లా, మదనపనల్లె నియోజకవర్గంలో వైసీపీ నాయకులు అరాచకాలను ఎదుర్కొన్న టీడీపీ నాయకులపై అప్పట్లో కేసులు నమోదు చేశారు. ఆ కేసుల్లో వాయిదాకు సోమవారం స్థానిక మదనపల్లె కోర్టులో హాజరయ్యారు. ఇందులో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి రాటకొండ మధుబాబు, రాజంపేట పార్లమెంట్ ప్రధానకార్యదర్శి యాగిరి దొరస్వామి నాయుడు, పఠాన్ ఖాదర్ ఖాన్ తదితరులు హాజరయ్యారు.

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చైన్నైలో చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కురబల కోట మండలం, అంగళ్లలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న మదనపల్లె పట్టణం, ఎగువ కురవంకకు చెందిన బండి నీలిరాజు(21) లివర్ వ్యాధితో బాధపడేవాడు. కుటుంబ సభ్యులు బయట మసాల తిండి తిన వద్దని చెప్పినా వినక పోవడంతో వారు మందలించారు. దీనికి మనస్తాపానికి గురై గత నెల 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చైన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్7 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె తాలుకా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న టి .జయప్రకాష్ (32) శనివారం తన కుమారుడిని చికిత్స కోసం బెంగళూరు తీసుకెళ్లారు. అక్కడ బులెట్ బైక్ ఢీకొనడంతో అతని తలకు గాయమైంది. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు అతనిని తిరుపతికి తరలించగా రెండు రోజుల పాట కోమాలో ఉన్న ఆయన సోమవారం రాత్రి 7 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అవమానం భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం పుంగనూరు మండలం, మేలుపట్లకు చెందిన నారాయణస్వామి భార్య సునీత(45) తన కుమారులకు రెండు కార్లు ఇప్పించాలని కోరుతూ పుంగనూరు రోడ్డులోని హరికార్స్ యజమాని హరికృష్ణకు కొద్దిరోజుల క్రితం రూ.15 లక్షలు ఇచ్చింది. అతను కార్లు ఇవ్వకపోగా డబ్బు కూడా వాపసు చేయక పోవడంతో సోమవారం కారు షెడ్ వద్దకు వచ్చి డబ్బు డిమాండ్ చేసింది. దీంతో హరికృష్ణ కుటుంబ సభ్యులు ఆమెను కొట్టారు. దీంతో మనస్తాపానికి గురై అక్కడే ఉన్న ఆయిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..!

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాలు స్వీకరించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సమస్యలను ఆలకించి పరిష్కరించాలని పలువురు సబ్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో భాగంగా సోమవారం సబ్ కలెక్టరేట్‌లో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించి వినతిపత్రాల్లో కొన్నింటి వివరాలిలా ఉన్నాయి

ఆర్వో ప్లాంటుకు స్థలం కేటాయించండి

నిమ్మనపల్లె మండలం, అగ్రహారం గ్రామంలో తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండడంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేసింది. ఇందుకోసం స్థలం కేటాయించాలని నిమ్మనపల్లె తహసీల్దార్ అమరనాథ్‌కు విన్నవించినా స్పందన లేదని వెంటనే స్థలం కేటాయించాలని గ్రామస్థులు కోరారు.

దారికి అడ్డుగా అక్రమ నిర్మాణాలు

మదనపల్లె మండలం, పొన్నూటిపాలెంలో సర్వే నెంబరు 420లోని 35.10 ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకుని, అక్రమనిర్మాణాలు చేస్తూ ఇతరులకు దారి లేకుండా చేస్తున్నట్లు బోయపాటి శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. అక్రమకట్టడాలను అడ్డుకోవాలని కోరారు.

దాన సెటిల్‌మెంట్ రద్దు చేయాలి

పీలేరు నియోజకవర్గం, కేవీ పల్లె మండలం, గ్యారంపల్లె సంకేను గుట్టపల్లెకు చెందిన ఎగువపల్లె రాజారెడ్డి తన మనవళ్లకు దాన సెటిల్‌మెంట్ కింద రాసిన 7.49 ఎకరాలు భూమికి చెందిన దస్తావేజును రద్దు చేయాలని కోరుతూ అర్జీని సమర్పించారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న తనను ఎవరూ సమరక్షించలేదని ఇంటిలో కదలలేని పరిస్థితిలో ఉన్న తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

వృద్ధాప్య పెన్షన్ ఇప్పించండి

తన భర్త వెంకటస్వామి రెండేళ్ల క్రితం మరణించాడని, తనను ఎవ్వరూ చూడలేదని, వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని తంబళ్లపల్లె మండలం, గోపిదిన్నె గ్రామం, రాగిమానుదిన్నెపల్లెకు చెందిన వెంకటరమణమ్మ విన్నవించారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

22ఏ నుంచి తొలగించండి

మదనపల్లె మండలం, అక్కిశెట్టిపల్లె గ్రామం పప్పిరెడ్డిపల్లె రెవెన్యూ సర్వే నెంబరు 3-6లో ఉన్న 0.79 ఎకరాల భూమి తమ పిత్రార్జితమని, . ప్రస్తుతం ఇది నిషేదిత భూముల జాబితాలో ఉందని, దయచేసి 22ఏ జాబితా నుంచి ఆ భూమిన తొలగించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

పీలేరు/మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సదుం మండలం కలకటవారిపల్లెలో డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మేరకు చర్యలు తీసుకోవాలంటూ ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరారు. పీలేరు, మదనపల్లెలోని తహసీల్దారు కార్యాలయాల వద్ద సోమవారం వారు వేర్వేరుగా నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకట వారిపల్లెలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సదుం తహసీల్దారు మారూఫ్ హుస్సేన్, సీఐ రాంభూపాల్, ఎస్ఐ షేక్ షావలి ఈ నెల 4న ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఏకపక్షంగా తొలగించడమే కాకుండా, రెండు ముక్కలుగా విరిచేశారన్నారు. గ్రామంలోని అగ్రవర్ణాల ఒత్తిడి మేరకు అధికారులు అలా చేశారని వారు ఆరోపించారు. తొలగించిన స్థానంలోనే అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోతే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు తుమ్మల ధరణీ కుమార్, జెట్టి మల్లికార్జున, ముల్లంగి కృష్ణయ్య, టీఎల్ వెంకటేశ్, ఎద్దుల మహేశ్ యాదవ్, రాజేశ్వరి, షేక్ షాహిన్‌షా, ఆనంద్, బాలగంగాధర్, దుర్గాప్రసాద్, అక్రమ్ బాషా, మాల మహానాడు నాయకులు యమల చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన, వీరనాల మాణిక్యం, లక్ష్మీపతి, మోహన్, పెద్దోడు, గురుమూర్తి, బాస్కర్, గంగరాజు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పీలేరు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు



మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మాలమహానాడు నాయకులు

కేబీజీవీ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

రామసముద్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం సర్వశిక్ష అభియాన్ పథకం కింద ప్రభుత్వం రూ.30 లక్షల నిధులు మంజూరు చేయగా, సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు విజయ కుమార్ గౌడు భూమి పూజ చేసి పనులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మస్తాన్‌బీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల పరిరక్షణ కష్టంగా మారిందని, మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా, విజయకుమార్‌గౌడులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భూమి పూజ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాజీ సర్పంచ్ బండెల శివప్ప, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, ఎస్.శివ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రహరీపనులకు భూమి పూజ చేస్తున్న విజయకుమార్‌రెడ్డి

బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కస్టమర్ల మాసం సందర్భంగా సోమవారం నుంచి బీఎస్ఎన్ఎల్ కస్టమర్ల సర్వీస్ క్యాంపులు నిర్వహిస్తోందని, మంగళవారం మదనపల్లె డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో క్యాంపు నిర్వహిస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ డీఈ అబిద్‌అలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మదనపల్లె డివిజన్ కార్యాలయం, టెలిఫోన్ ఎక్సేంజ్ ప్రాంగణంలో నిర్వహించే క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చి ద్రోహం చేశారు'

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):ముస్లింల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడం వారికి ద్రోహం చేసినట్లే అని వైసీపీ ఎంపీపీలు అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏడాది గడుస్తున్నా సూపర్‌సిక్స్‌లు హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాజంపేట వైసీపీ అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, కురబకోట ఎంపీపీ భూదేవి, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు సాంబశివ, పెద్ద మ్యమ్యం ఎంపీపీ పూర్ణిక రమేష్, రేవతి, మదనపల్లె వైసీపీ యూత్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నాభిషేకం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షే శ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్నాభిషేకం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో సనగరం లక్ష్మీనరసింహాశర్మ దంపతులు అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మడకశిరకు చెందిన (యూఎస్ఏ) వెంకటేశ్ అన్నదానానికి ఆర్థిక సాయం అందించారు. సమీప గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

నేడు కలికిరికి మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి మంగళవారం కలికిరి రాను న్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప ఒక ప్రకటనలో తెలి పారు. ఆ రోజు ఉదయం 11.55 గంటలకు హైదరాబాదులో బయలు దేరి మధ్యాహ్నం 3.05కు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్న తరువాత రాత్రి 7 గంటలకు తిరుపతి కరకంబాడిరోడ్డులోని ఆశా కన్వెన్షన్‌కు చేరుకుంటారు. రాత్రి 7.30కు ఆశా కన్వెన్షన్ నుంచి బయలుదేరి 9 గంటలకు కలికిరి చేరుకుని బస చేయనున్నారు. ఆ తరువాత కార్యక్రమాలను ప్రకటిస్తామని కృష్ణప్ప వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్రంకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నడిమిఖండ్రిగ, టి.పసల వాండ్లపల్లె, చెర్లోపల్లెల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నట్లు సబ్ ఇంజనీర్ మౌసిన్ తెలిపారు. విద్యుత్ లైన్‌లో మరమ్మతుల నిమితం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. కావున రైతులు, ప్రజలు గమనించాలని కోరారు.

ట్రాన్స్‌కో ఏఈగా గిరిధర్

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో ట్రాన్స్ కో ఏఈగా గిరిధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తు న్న ఉత్తన్న బదిలీపై గుర్రంకొండకు వెళ్లి పోగా, మొలకలచెరువు ఏఈ రామలక్ష్మ య్య ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం గిరిధర్ బాధ్యతలు స్వీకరించడంతో లైన్ ఇన్‌స్పెక్టర్ రమణ, లైన్‌మన్ జేవీ రమణ పూల మాలలు వేసి సత్కరించారు.

జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు. స్థానిక పీటీఎం రోడ్డులో ఉన్న సామిల్ వెనుక వైపు ఖాళీ స్థలంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌నాయక్ దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.32,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మొక్కుబడిగా గుర్రంకొండ మండల సమావేశం!

గుర్రంకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గుర్రంకొండ మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశులు శాఖల వారీగా సమీక్ష చేశారు. ప్రతి శాఖ అధికారి తమ వద్ద ఉన్న సమాచారం చదవడం తమ శాఖ సంబంధించి డౌట్లు అడగండని చెప్పడం తప్ప, సభ్యుల నుంచి మరో మాట వినిపించ లేదు. . మండలంలో 15 మంది సర్పంచులు, 12 మంది ఎంపీటీసీ సభ్యులుండగా సోమవారం జరిగిన సమావేశానికి ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. వీరిలో ముగ్గురు సమావేశం ప్రారంభం కాగానే వెళ్లిపోగా, ఎంపీపీతో కలిపి నలుగురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే సమావేశం చివరి దాకా ఉన్నారు. 15 మంది సర్పంచులకు గానూ కేవలం ఖండ్రిగ సర్పంచ్ రౌనక్‌బాషా మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశంలో నలుగురు ఎంపీటీసీ సభ్యులు, ఓ సర్పంచ్, జడ్పీటీసీ సభ్యురాలు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు మాత్రమే మిగిలారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలంటూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలతో కార్పొరేట్లకు సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి మతాలపై రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. ఇప్పుడు వక్ఫ్ సవరణ బిలుతో మైనార్టీలను ఇబ్బందులకు గుర్తు చేస్తున్నారే తప్ప ప్రజా ప్రయోజనాలకు పనికి వచ్చే ఒక్క పని చేయడంలేదని ధ్వజమె త్తారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీలు నరేంద్ర మోడీకి గులాం గిరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళి, సూరి, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు బహుమతులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ వన్ డిపో పరిధిలోని ఉద్యోగులకు సోమవారం గేట్‌మీటింగ్ నిర్వహించి ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతోపాటు నగదు బహుమతులు అందించినట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి మాసంలో కేఎంపీఎల్, ఈపీకే, ఓఆర్‌లలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ ఉద్యోగులను గుర్తించి బహుమతులు అందించారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు పని చేయాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

పీలేరు రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలోని 15 పంచాయతీల్లో విధిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ పీలేరు పట్టణంతోపాటు జనసంచారం అధికంగా ఉండే ప్రధాన కూడలిలో చలివేంద్రాల ఏర్పాటుతో ప్రజల దాహాన్ని తీర్చవచ్చునన్నారు. పంచాయతీలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 15 రోజులకు ఓ సారి తాగునీటి ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోపు ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలని తెలిపారు. కార్యకమంలో ఈవోపీఆర్డీ లతీఫ్‌ఖాన్, నాగేంద్ర, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో మురళీమోహన్ తెలిపారు. సోమవారం అగ్రహారం రోడ్డులో కోరమాండల్ ఎరువుల దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎంఆర్పీ ధరకే విక్రయించడంతోపాటు, తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఏరియా మేనేజర్ మహేష్, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో మురళీమోహన్

మాతా శిశు సంరక్షణపై దృష్టి సారించాలి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణ సేవలపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని డాక్టర్ సన సూచించారు. సోమ వారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఆస్పత్రి ఆవ రణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణపై ప్రతి గ్రామంలోనూ అవగాహన కల్పించాల న్నారు. మాతాశివు మరణాల నివారణకు కృషి చేయాలన్నారు. ఆ కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మావతి, సూపర్‌వైజర్ దేవకుమారి, పీహెచ్ఎన్ సరోజ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

షూటింగ్ బాల్ జట్టుకు కన్నెమడుగు విద్యార్థులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా షూటింగ్ బాల్ జట్టుకు మండలంలోని కన్నెమడుగు హైస్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం మదనపల్లె ప్రైమ్ స్పోర్ట్స్ అరీనాలో నిర్వహించిన పోటీలలో కన్నెమడుగు హైస్కూల్ నుంచి ఆరుగురు పాల్గొనగా బాలుర విభాగంలో యోగేంద్ర, బాలికల విభాగంలో సుమిత్ర, ప్రణీత, సంధ్య స్టాండ్ బై ప్లేయర్‌గా రిషిత ఎంపికయ్యారు. వీరు ఈ నెల 26, 27 తేదీల్లో మదనపల్లెలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ తెలిపారు. ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం మదన్‌మోహన్, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్ అభినందించారు.

'మంచి ఆరోగ్యంతోనే,, మంచి భవిష్యత్తు '

పీలేరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మంచి ఆరోగ్యంతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌష్టికాహారం, సరైన నిద్ర, శారీరక శ్రమ, ధూమ, మద్యపానానికి దూరంగా ఉండడం, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునన్నారు. విద్యార్థి దశలో ఎటువంటి ఆకర్షణలు, దురలవాట్లకు లోనుకాకుండా కేవలం విద్యపైనే దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి 'మంచి అలవాట్లతో మనం ఎంతో క్షేమం, ఆరోగ్యమే మహాభాగ్యం' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చింతల విజయ భాస్కర రెడ్డి, డా.లావణ్య, హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎంలు భార్గవి, ధనభాగ్యమ్మ, విజయ, ప్రమీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.